ప్రజలకు రుణపడి ఉంటా..

శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ



ఎమ్మెల్యే అరెకపూడి గాంధీకి శుభాకాంక్షలు తెలుపుతున్న కార్పొరేటర్ మాధవరం రోజాదేవి

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గం నుంచి మూడోసారి తనను భారీ మెజార్టీతో గెలిపించినందుకు నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటానని ఎమ్మెల్యేగా అరెకపూడి గాంధీ అన్నారు. హ్యాట్రిక్ విజయం సాధించిన ఆయనను ఆదివారం వివేకానందనగర్ డివిజన్ కార్పొరేటర్ రోజాదేవి రంగారావు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తనపై విశ్వాసంతో మూడోసారి ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో గెలిపించిన నియోజకవర్గ ప్రజలందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు అన్నారు. తన విజయంలో నియోజకవర్గ ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అసోసియేషన్ సభ్యుల కృషి ఎనలేనిదన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, వివేకానందనగర్ డివిజన్ అధ్యక్షుడు సంజీవరెడ్డి, సగర మహిళా సంఘం జగద్గిరిగుట్ట అధ్యక్షులు తిరుపతమ్మ, ప్రధాన కార్యదర్శి శాంత సుమ సగర, మంజుల సగర, దయాసాగర్, ఆస్కాని శ్రీనివాస్ సాగర్, రాములు సాగర్, రామ్ సాగర్‌లు పాల్గొన్నారు.

నూతన ఎమ్మెల్యేలకు అభినందనలు


ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌తో గొట్టిముక్కల వెంగళరావు


సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో..

కూకట్‌పల్లి: ఇటీవల జరిగిన ఎన్నికల్లో విజయం సాధించిన ఎమ్మెల్యేలను కూకట్‌పల్లి బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు గొట్టిముక్కల వెంగళరావు ఆదివారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఖైరతాబాద్ నుంచి ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో విజయం సాధించిన దానం నాగేందర్, సనత్‌నగర్ ఎమ్మెల్యేగా మూడోసారి భారీ మెజార్టీతో విజయం సాధించిన తలసాని శ్రీనివాస్ యాదవ్‌లకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గొట్టిముక్కల తేజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మూసాపేట డివిజన్ బీఆర్ఎస్ కార్యాలయం ప్రారంభం



మూసాపేట: మూసాపేట డివిజన్‌లో మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఎన్నికల్లో మూసాపేట డివిజన్‌లో మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో కార్యకర్తలు, నాయకులు, స్థానిక ప్రజలు తనకు ఓట్లు వేసి గెలిపించారన్నారు. డివిజన్‌లో పార్టీ కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకోవటం శుభ పరిణామమన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌లు సతీష్ గౌడ్, నర్సింహ యాదవ్, మందడి శ్రీనివాసరావు, జూపల్లి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ బాబూరావు, గౌసుద్దీన్, డివిజన అధ్యక్షులు అంబటి శ్రీనివాస్, ప్రభాకర్ గౌడ్, జిల్లా గోపాల్, తూము కొండల్, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా నిలవాలి



దుప్పట్లు పంపిణీ చేస్తున్న మక్కాల నర్సింగ్, డాక్టర్ అందె సుధాకర్

ఓల్డ్ బోయిన్‌పల్లి: ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్న అని మాజీ కౌన్సిలర్ మక్కాల నర్సింగ్ అన్నారు. ఆదివారం ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ హస్మత్‌పేట మోడల్ మార్కెట్ సమీపంలో కింగ్ ఆఫ్ కింగ్ మినిస్ట్రీ అధ్యక్షుడు డాక్టర్ అందె సుదాకర్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన రగ్గులు, చీరల పంపిణీ కార్యక్రమానికి అయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత 11 ఏళ్లుగా కింగ్ ఆఫ్ కింగ్ మినిస్ట్రీ నిర్వాహకులు పేదలకు అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. లెప్రసీ రోగులు, వృద్ధులు, అంధులు, అనాథలకు ఏటా దుప్పట్లు, దుస్తులు అందిస్తున్నారన్నారు. ఏడాది పొడవున ఉచిత వైద్యంతో పాటు వారి అకలి తీర్చేందుకు చేపట్టిన సేవా కార్యక్రమాల్లో తాము పాలుపంచుకోవడం ఆనందంగా ఉందన్నారు. కింగ్ ఆఫ్ కింగ్ మినిస్ట్రీ అధ్యక్షుడు డాక్టర్ అందె సుదాకర్ మాట్లాడుతూ మానవ సేవే మాధవ సేవ అన్నారు. పేద ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో 11ఏళ్లుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మదర్ థెరిసా స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు నారాయణగౌడ్,బాస్కర్, ఫస్టర్లు గొంగొళ్ల సునీల్, కనకం అశోక్, ప్రభుకుమార్ కింగ్ ఆఫ్ కింగ్ మినిస్ట్రీ సభ్యులు సంజీవ్, సురేష్, మనీష్, ప్రేమ్‌కుమార్, మహేష్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

- ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానం
- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు
- భవానీ నగర్‌లో సీసీ కెమెరాల ప్రారంభం


భవానీనగర్‌లో సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తదితరులు


ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు నోట్ బుక్స్ అందజేస్తున్న మస్తాన్‌రెడ్డి తదితరులు

కూకట్‌పల్లి: సీసీ కెమెరాలతో నేరాలకు అడ్డుకట్ట వేయవచ్చునని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఆదివారం ఆయన ఫతేనగర్ డివిజన్, భవానీ నగర్‌లో స్థానిక కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్‌తో కలిసి సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీసీ కెమెరాల ఏర్పాటుతో ప్రజలందరికి రక్షణ కలుగుతుందన్నారు. ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమన్నారు. నేర పరిశోధనలో పోలీసులకు సీసీ కెమెరాలు ఎంతగానో తోడ్పడతాయన్నారు. ప్రతి బస్తీ, కాలనీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మూసాపేట డివిజన్ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్, తూము జగదీష్, తలారి రాము తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు అభినందనలు

మోతీనగర్: కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును అల్లాపూర్ డివిజన్ బీఆర్ఎస్ యూత్ ప్రెసిడెంట్ దేవరింటి మస్తాన్ రెడ్డి ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు నోట్ పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా మస్తాన్ రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే కృష్ణారావు నియోజకవర్గంలో గత పదేళ్లుగా చేసిన అభివృద్ధే ఆయన విజ యానికి దోహదం చేసిందన్నారు. ఎమ్మెల్యే గెలుపులో కీలకపాత్ర పోషించిన మేడ్చల్ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు మహమ్మద్ గౌసుద్దీన్‌కు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో అల్లాపూర్ డివిజన్ అధ్యక్షుడు ఐలయ్య, రవీందర్ ముదిరాజ్, అంకమరావు, సంజీవరావు, వీరస్వామి, రాజారెడ్డి, భాస్కరాచారి, ఆది నారాయణ, సతీష్ రెడ్డి, శర్మ, భాను, దీపక్ పాల్గొన్నారు.

సందడిగా శిల్పారామం

మాదాపూర్: ఆదివారం సెలవురోజు కావడంతో సందర్శకులు శిల్పారామాన్ని అధిక సంఖ్యలో సందర్శించారు. సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించారు. ప్రతి రోజు 2వేల మంది సందర్శించే వారని, సెలవు రోజుల్లో, శని, ఆదివారాలలో 6వేల నుండి 8వేల వరకు వస్తున్నారని నిర్వాహకులు తెలిపారు.

ఆకట్టుకున్న 'చండాలిక'

హఫీజ్‌పేట్: చండాలిక నృత్యరూపకం అందరినీ ఆకట్టుకుంది. ఆదివారం గచ్చిబౌలిలోని రంగ్ భూమిలో అక్షిద సమర్పణలో నిర్వహించిన నృత్యరూపకం సందేశాత్మంగా సాగింది. రంగ్ భూమి ఆడిటోరియం వేదికగా ప్రముఖ నృత్యకారిణి నియంత్రికరెడ్డి సారథ్యంలో తన 40 మంది శిష్యబృందం అద్భుతంగా లయబద్ధంగా చక్కని అభినయం, హావభావాలతో ఆవిష్కరించిన రూపకం ఆద్యంతం ఆకట్టుకుంది. అనంతరం కళాకారులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.కార్యక్రమంలో ప్రముఖ కూచిపూడి నర్తకి సవిత భమిడిపాటి, ఆచార్య సాంబశివరావు, ప్రొఫెసర్ అరుణ భిక్కు పాల్గొన్నారు.

పరిశోధనలో ప్రతిపాదనలు శాస్త్రీయంగా ఉండాలి

రాయదుర్గం: పరిశోధనలో ఊహా ప్రతిపాదన శాస్త్రీయంగా ఉండాలని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ తెలుగు విభాగం అధ్యక్షుడు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. హెచ్‌సీయూలోని తెలుగు విభాగం కార్యాలయం నుంచి ఆన్‌లైన్ ద్వారా పిఆర్ఆర్ అండ్ విఎస్ ప్రభుత్వ కళాశాల తెలుగు పరిశోధన కేంద్రం, డికె ప్రభుత్వ మహిళా కళాశాల నెల్లూరు ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహించిన పరిశోధనా విధానం రెండు రోజుల సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. పరిశోధన ప్రణాళికలో ఊహ ప్రతిపాదన సూటిగా, స్పష్టంగా వివరణాత్మకంగా ఉండాలని చెప్పారు. సిద్ధాంత వ్యాస రూపకల్పన ఆకారాలు అనే అంశంపై వెంకటేశ్వర విశ్వవిద్యాలయం తెలుగు శాఖ పూర్వ అధ్యక్షుడు ఆచార్య మేడిపల్లి రవికుమార్ ప్రసంగించారు. అనంతరం పరిశోధక విద్యార్థులు, పీజీ విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు వివరణతో తెలుగు పరిశోధన పద్ధతులపై లోతైన చర్చ సాగింది. డాక్టర్ కరుణశ్రీ,, డా.పద్మప్రియ పాల్గొన్నారు.

ఘనంగా రేణుకా ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవం

నిజాంపేట్: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి బాచుపల్లిలోని శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయంలో ఆదివారం 13వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ నిర్ణయాలు అభినందనీయం



మోతీనగర్: కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియా గాంధీ, ప్రియాంకా గాంధీ, రాహుల్ గాంధీ నేతృత్వంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీసుకుంటున్న నిర్ణయాలు అభినందనీయమని కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడిన సందర్భంగా మోతీనగర్‌లో సీనియర్ నాయకుడు గోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన విజయోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించిన అనంతరం పీజేఆర్, అంబేడ్కర్, ఎన్‌టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ మహిళలకు ఆర్‌టిసి బస్సు ఉచితంగా ప్రయాణం సందర్భంగా సోనియాగాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.


విజయోత్సవ సభలో బండి రమేష్ తదితరులు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయాలపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. పార్టీ అధికారంలోకి వచ్చిన రెండు రోజుల్లోనే రెండు పథకాలని అమల్లోకి తీసుకువచ్చారన్నారు. కార్యక్రమంలో సీనియర్‌నాయకులు సయ్యద్ బాబా, రేష్మ, రాజశేఖర్ రెడ్డి, ఖాత్రీ, రహీం, శ్రీనివాస్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



తెలంగాణ మూవీ, టీవీ, డిజిటల్ ఆర్టిస్ట్ యూనియన్ సర్వసభ్య సమావేశం..


సమావేశంలో పాల్గొన్న నాయకులు

మోతీనగర్: మోతీనగర్ ఫంక్షన్ హాల్‌లోఆదివారం తెలంగాణ మూవీ, టీవీ, డిజిటల్ ఆర్టిస్ట్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. యూనియన్ ఫౌండర్, మెంబర్ అరుణ్‌కుమార్ నాగభైరవ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో 400 మంది సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రెసిడెంట్ రాజశేఖర్ మాట్లాడుతూ యూనియన్ ఏర్పడి రెండేళ్లు పూర్తయ్యిందని, త్వరలో యూనియన్ ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎన్నికలకు సంబంధించి ఫౌండర్, మెంబర్‌ల చేత ఎన్నికల కమిటీ ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా ఆర్థిక లావాదేవీలపై చర్చించారు. సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు. కార్యక్రమంలో ఫౌండర్, ప్రెసిడెంట్ పి. సుందర్, కమిటీ చైర్మన్ నందూరి రాము, జనరల్ సెక్రటరి గోవింద్ శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్లు దాసరి పద్మ రేఖ, శ్రీనివాస్ రాథోడ్, కోర్ కమిటి సభ్యులు, ఈసీ మెంబర్లు, సీనియర్ ఆర్టిస్టులు పి.ఆర్.ఓ. గోంగూర శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాలోత్సవ్

నిజాంపేట్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు ఆదివారం ప్రగతినగర్‌కు చెందిన ప్రగతి బాలోత్సవ కమిటీ ఆధ్వర్యంలో బాలోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ప్రగతి సెంట్రల్ స్కూల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో 36 పాఠశాలలకు చెందిన 1600 మంది విద్యార్థులు 13 రకాల ఈవెంట్లలో పాల్గొని తమ ప్రతిభను చాటారు. ఈ సందర్భంగా ప్రగతి విద్యానికేతన్ ప్రిన్సిపాల్ ఎస్.మాధవి, సుందరయ్య భవన్ నిర్వహణ కన్వీనర్ సిహెచ్ మల్లయ్య చారి, పీపుల్స్ ట్రస్ట్ సమన్వయకర్త సిహెచ్ కృష్ణారావు మాట్లాడుతూ బాల బాలికల్లో నైపుణ్యాన్ని ప్రదర్శించటానికి ఒక వేదికగా ప్రగతి విద్యానికేతన్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. విద్యార్థుల మనోవికాసానికి, ఉల్లాసానికి, ఉత్సాహానికి, వారిలో దాగి ఉన్న ప్రతిభను వారు తెలుసుకునే విధంగా భవిష్యత్తులో నైపుణ్యాన్ని పెంచుకునేందుకు బాలోత్సవ్ అవకాశం కల్పించిందన్నారు. అనంతరం వివిధ అంశాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పీపుల్స్ ప్రోగ్రెసివ్ ట్రస్ట్ అధినేత డి.దయాకర్‌రెడ్డి బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు శ్రీరాములు, వెంకటరామయ్య, సుజాత, కాలనీ ఫౌండర్లు సోమిరెడ్డి, సూర్యప్రకాష్, బాల వెంకటేశ్వర రావు, శంకర్ రావు, వాలంటీర్లు చంద్రశేఖర్, బాలపీరు, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.


బాలోత్సవ్‌కు హాజరైన విద్యార్థులు

ఘనంగా కార్తీక వన సమారాధన


కౌండిన్య సేవా సమితి కార్తీక వన భోజన కార్యక్రమం..


వన సమారాధనలో పాల్గొన్న బ్రాహ్మణ కుటుంబాలు

మోతీనగర్: శ్రీ శృంగేరీ శారదా పీఠంలో ఆదివారం మోతీనగర్, బ్రాహ్మణ అభ్యుదయ సమితి ఆధ్వర్యంలో వన సమారాధన నిర్వహించారు. బ్రాహ్మణ పెద్దలు చంద్రమూర్తి, శంకర నారాయణ, అనిత, విజయలక్ష్మీ, సుబ్బారావు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అభ్యుదయ సమితి కార్యాచరణను వివరించారు. బాల శాస్త్రి, మీనాక్షి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విభావరి, నిట్టల కిరణ్మయి ప్రవచనాలు అలరించాయి.

కౌండిన్య సేవా సమితి ఆధ్వర్యంలో...

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి కౌండిన్య సేవా సమితి ఆధ్వర్యంలో వివేకానందనగర్‌లోని చిత్తారమ్మ ఆలయ ప్రాంగణంలో ఆదివారం కార్తీక మాస వనభోజనాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గౌడ కుల సంఘం నాయకులు మాట్లాడుతూ గౌడ కులస్తులు సంఘటితం కావాలన్నారు. కార్యక్రమంలో అధ్యక్షులు గాంధీ సుబ్బారావు గౌడ్, మురళీ గౌడ్, చక్రపాణి గౌడ్, ఏకాంత్ గౌడ్, విష్ణుమూర్తి గౌడ్, యాదగిరి గౌడ్, విద్యాకల్పన గౌడ్, కమిటి సభ్యులు, గౌడ బంధువులు పాల్గొన్నారు.

కామాక్షి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో..

భాగ్యనగర్‌కాలనీ: కార్తీక మాసాన్ని పురస్కరించుకుని నిజాంపేట కామాక్షి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో హైదర్‌నగర్ డివిజన్ ఆదిత్యానగర్ కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం తృతీయ కార్తీక వన సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు శంకర్, నర్సింహారావు, సుధాకర్ నేతృత్వంలో ఏర్పాటు చేసి ఈ కార్యక్రమంలో హైదర్‌నగర్, ప్రగతినగర్, ఆదిత్యనగర్, సమతానగర్, తులసీనగర్, శ్రీనివాసనగర్, మియాపూర్, చందానగర్ సహా పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో బ్రాహ్మణ కుటుంబాలు హాజరయ్యాయి. ప్రముఖ చలన చిత్ర నటులు కృష్ణమూర్తి, కేదారీ శంకర్, సారిపల్లి సతీష్, సుజాత, లక్ష్మీ కళ్యాణి, సునీత పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్తీక వన సమారాధనలు కుటుంబాల మధ్య సమష్టి తత్వాన్ని పెంపొందిస్తాయన్నారు. సనాతన సంప్రదాయాల పరిరక్షణలో బ్రాహ్మణులు ముందుండి సమాజానికి ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఎస్ఎస్ఎస్ చైర్మన్ చకిలం సుధాకర్, వెస్ట్ జోన్ అధ్యక్ష, కార్యదర్శులు రాఘవ, రమేష్, కామాక్షి, బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు కరుణాకర్, భువనేశ్వరి, విజయ, వెంకటరమణి, కళ్యాణి, రాయప్రోలు రాఘవ శర్మ, భవానీ, ప్రతినిధులు పాల్గొన్నారు.


బ్రాహ్మణ అభ్యుదయ సమితి ఆధ్వర్యంలో...

నేడు హరిహర క్షేత్రంలో కార్తీక మాస పూజలు

మూసాపేట: భరత్‌నగర్‌కాలనీలోని హరిహర క్షేత్రంలో కార్తీక మాసం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు అర్చకులు కృష్ణ సూరి తెలిపారు. నాలుగో సోమవారం సందర్భంగా ఉదయం 5 గంటల నుంచి అభిషేకాలు, సామూహిక అభిషేకాలు, అర్చనలు ఉంటాయని, సాయంత్రం కాశీ విశాలాక్షి విశ్వేశ్వర స్వామి కల్యాణం, వన భోజనాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

సమష్టి కృషితోనే విజయం


ఎమ్మెల్యే అరెకపూడి గాంధీని గజమాలతో సత్కరిస్తున్న దృశ్యం

ఆల్విన్‌కాలనీ: నాయకులు, కార్యకర్తల సమష్టి కృషితోనే తాను ఘన విజయం సాధించానని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. హ్యాట్రిక్ విజయం సాధించిన సందర్భంగా ఆదివారం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని నల్లగండ్ల, హుడా కాలనీ, నవోదయ కాలనీ, సాయినగర్, సైబర్ ఎన్‌క్లేవ్, శ్రీకృష్ణ కాలనీ, ఖాజాగూడ హరిజన బస్తీ, రాయదుర్గం హరిజన యూత్ సభ్యులు, గోపన్ పల్లి ఎన్‌టిఆర్‌నగర్ కాలనీల వాసులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కాలనీ అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యేను భారీ గజమాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తనపై విశ్వాసంతో మూడోసారి గెలిపించినందుకు ప్రజలందరికీ ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు.

గవర కులస్తుల సమస్యలు పరిష్కరించాలి


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న బండి రమేష్, గవర సంఘు నాయకులు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీలోని గోధా కృష్ణ గార్డెన్స్‌లో ఆదివారం గవర కార్తీక వనభోజన సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సభ అధ్యక్షులు ఆళ్ల రామకృష్ణ మాట్లాడుతూ గవర కులస్తులు ఎన్నో రోజులుగా అన్యాయానికి గురవుతున్నారన్నారు. తొలగించిన 26 కులాలను బీసీ జాబితాలో చేర్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గౌరీ మాత కుటుంబ సభ్యులు హాజరయ్యారు.

కాంగ్రెస్ పాలనలో మహిళలకు ప్రాధాన్యం


కార్యక్రమంలో పాల్గొన్న జగదీశ్వర్ గౌడ్ తదితరులు

ఆల్విన్‌కాలనీ: కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ప్రాధాన్యం ఇస్తుందని అందులో భాగంగానే మహాలక్ష్మి పేరుతో ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించిందని శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్ గౌడ్ అన్నారు. మహాలక్ష్మి పథకం ప్రారంభం సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ పథకాన్ని ప్రారంభించటం పట్ల మహిళలందరు సంతోషంగా ఉన్నారన్నారు.త్వరలోనే మిగిలిన గ్యారంటీలను కూడా అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాజు, ఏకాంత్ గౌడ్, ధ్యగం శ్రీహరి గౌడ్, రాజన్ తదితరులు పాల్గొన్నారు.

మాకూ ఉపాధి చూపండి..



జీడిమెట్ల: కాంగ్రెస్ ప్రభుత్వం 'మహాలక్ష్మి' పేరుతో మహిళలకు ఉచితంగా ప్రవేశపెట్టిన బస్సు ప్రయాణ పథకం తమ బతుకులను అంధకారంలోకి నెట్టిందని అటో, క్యాబ్ డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఓలా, ఉబర్ యాప్‌ల నిర్వాహకుల దోపిడీతో తీవ్ర నష్టాల్లో ఉన్న తమను ప్రభుత్వం కోలుకోలేని దెబ్బతీసిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా అటో నడుపుతూ జీవనం సాగిస్తున్న తాము ఇకపై ప్రత్యామ్నాయ మార్గాలను వెతుక్కోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. కిరాయి ఆటోలను నడుపుకుని చాలీచాలని ఆదాయంతో జీవనం సాగిస్తున్న తాము ఇకపై కుటుంబాలను ఎలా పోషించుకోవాలని వారు కన్నీటి పర్యంతమయ్యారు.


కుటుంబాలను పోషించుకునేదెలా..

గ్రామాల్లో ఉపాధిలేక పొట్ట చేతపట్టుకుని నగరానికి వలసవచ్చిన తమకు మహిళలు అటోల్లో ఎక్కకపోతే తమకు వచ్చే డబ్బులు రావని అటో డ్రైవర్లు అవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇంటి కిరాయిలు ఎలా కట్టాలి, పిల్లల స్కూలు ఫీజులు ఎలా చెల్లించాలని వారు ప్రశ్నిస్తున్నారు.

ఈఎంఐలు ఎలా చెల్లించాలి..

ఓలా, ఉబర్‌లు నడుపుకునే తాము ప్రతి నెల కార్లకు ఈఎంఐలు చెల్లించాల్సి ఉంటుందని,తమకు గిరాకీ దక్కకపోతే ప్రతినెల బ్యాంకు చెల్లింపులు కష్టమేనని అంటున్నారు. దీంతో కార్లను అమ్ముకోవాల్సిన పరిస్థితి వస్తుందన్నారు.

ఆదాయం పడిపోతుంది..



సంగారెడ్డి నుండి బతుకుదెరువు కోసం కుత్బుల్లాపూర్ వచ్చి అటో నడుపుకుంటున్నాను. వచ్చిన అదాయంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నా. ఇకపై మహిళలు అటోల్లో ఎక్కకపోతే సగం ఆదాయం పడిపోతుంది. దీంతో మేము కుటుంబాలు ఎలా పోషించుకోవాలనే అలోచనలో పడ్డాం . ప్రభుత్వం మా కోసం ఏదైనా సహాయం చేస్తే బాగుంటుంది.

వెంకటేష్ (అటో డ్రైవర్)..

ప్రతి నెలా రూ.25 వేలు ఈఎంఐ చెల్లించాలి



నేను క్యాబ్ నడుపుకుని జీవనం సాగిస్తున్నా. ప్రతినెలా రూ.25వేల వరకు ఈఎంఐలు చెల్లించాల్సి వస్తుంది. ఓలా, ఉబర్ కిరాయిలు దొరకకపోతే మేము కుటుంబాలను పోషించుకోవడం కష్టమే. మా కోసం ప్రభుత్వం ఆలోచించి అర్థిక సహాయం అందజేయాలి.

మహేష్ (క్యాబ్ డ్రైవర్)..